# నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | KAMAREDDY


### లౌకిక పాలకుడు

## ఛత్రపతి శివాజీ

### బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/వేల్పూర్, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆదర్శవంతుడైన లౌకిక పాలకుడని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, వేల్పూర్, బాల్కొండ మండల కేంద్రాల్లో వేముల సహకారంతో శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేయగా.. సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందూ సామ్రాజ్య విస్తరణకు పూనుకోవాలని పిలుపునిచ్చిన మహాయోధుడు ఛత్రపతి శివాజీ అని అన్నారు. ఆయన జీవించిన 50 ఏండ్లలో 27 ఏండ్లు మొగలులతో యుద్ధాలు చేస్తూ 300 కోటలను జయించిన మహావీరుడని పేర్కొన్నారు. ఛత్రపతి మొగలు రాజ్య విస్తరణను అడ్డుకున్నాడే తప్ప ఆనాటి ప్రజలను తారతమ్య దృష్టితో చూడలేదన్నారు. శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉప్లూర్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆవారి పటేల్ బృందం సభ్యులు, గ్రామయువకుల ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిప్పెర అనిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, వేల్పూర్‌లో ఎంపీటీసీ మొండి మహేశ్, మాజీ సర్పంచ్ తీగెల రాధా మోహన్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగధర్, రేగుల్ల రాములు, భోజన్న యాదవ్, ఛత్రపతి విగ్రహ సాధన కమిటీ అధ్యక్షుడు బి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## సాహో ఛత్రపతి



ఆదర్శనగర్‌లో నిర్వహించిన శివాజీ జయంతిలో నినాదాలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన గంప గోవర్ధన్




పిట్లంలో శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే షిండే, బీఆర్‌ఎస్ నాయకులు

**ఉమ్మడి జిల్లాలో** సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊరూరా ర్యాలీలు నిర్వహించి, శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలుచోట్ల శివాజీ విగ్రహాలను స్థానిక ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆదర్శవంతుడైన పాలకుడని కొనియాడారు.



శివాజీ వేష ధారణలో ఓ చిన్నారి



ఇందూరులో శివాజీ మహరాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు



నిజామాబాద్ రైల్వేస్టేషన్ వద్ద శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



# అర్వింద్ మాకొద్దు..

నిజామాబాద్ ఎంపీపై పెరుగుతున్న అసంతృప్తి

- సొంత పార్టీలోనే భారీగా వ్యతిరేకత
- నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో ఆందోళనలు
- ఎంపీ టికెట్ ఇవ్వొద్దంటూ ఏకమవుతున్న శ్రేణులు
- కాషాయ కార్యకర్తలనే మచ్చిక చేసుకోలేని దౌర్భాగ్యం
- అర్వింద్ వ్యవహార తీరుపై ఇప్పటికే అధిష్ఠానం సీరియస్

నిజామాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి); లోక్‌సభ ఎన్నికల వేళ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై అసంతృప్తి వెల్లువెత్తుతున్నది. ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ సొంత పార్టీలోనే నిరసన గళం వినిపిస్తున్నది. ఐదేండ్లుగా ఎంపీగా నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ఇసుమంతైనా అభివృద్ధి చేయకపోగా నోటికొచ్చి మాట్లాడుతూ పబ్బం గడుపుతుండడంపై ప్రజలతోపాటు పార్టీ శ్రేణుల్లో భారీగా వ్యతిరేకత ఏర్పడింది. కార్యకర్తలకు విలువ ఇవ్వకపోవడం, కొత్త నాయకులను తెర మీదికి తెచ్చి పాత తరం నేతలను పలుచన చేయడం వంటి చర్యలు బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆగ్రహానికి కారణమయ్యాయి. సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అర్వింద్ వద్దే వద్దు.. అంటూ నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన నాయకత్వం ధర్నాలు, నిరసనలు, ఆఖరికి పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం దాకా వెళ్లింది. అర్వింద్‌కు టికెట్ ఇస్తే మాత్రం తాడోపేడో తేల్చుకుంటామంటూ కార్యకర్తలు అధిష్టానానికి అల్టిమేటం జారీ చేస్తున్నారు. ధర్మపురి అర్వింద్ తీరు నచ్చక అసెంబ్లీ ఎన్నికల ముంగిట చాలా మంది పార్టీ వీడి ఇతర పార్టీల్లో చేరారు. ఇప్పుడు కూడా అదే ట్రెండ్ కొనసాగుతున్నది.

**అధిష్టానం సీరియస్..**

అర్వింద్ వ్యవహార శైలిపై గతంలోనే ఢిల్లీ పెద్దలు తీవ్ర స్థాయిలో మండిపడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ తీరు మార్చుకోకపోగా సొంత పార్టీ నేతలను టార్గెట్ చేసి వేధిస్తుండడంతో వారంతా కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు చేశారు. లోక్‌సభ ఎన్నికల ముంగిట వరుసగా ఫిర్యాదుల పరంపర కొనసాగుతుండడంతో అధిష్టానం ఆయనపై దృష్టి సారించినట్లు తెలిసింది. సరిగ్గా రెండు, మూడు వారాల్లోనే సాధారణ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉండడంతో టికెట్ వస్తుందా.. రాదా? అన్న మీమాంసలో నిజామాబాద్ ఎంపీ కొట్టుమిట్టాడుతున్నట్లు సమాచారం. ఈ మధ్య కాలంలో హైదరాబాద్ కన్నా ఎక్కువగా ఢిల్లీలోనే ఎక్కువగా కాలం గడుపుతూ ఢిల్లీ పెద్దలను మచ్చిక చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇక నిజామాబాద్ జిల్లా బీజేపీ ఆఫీస్ వద్ద, బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద గతేడాది జూలైలోనే అర్వింద్‌ను బీజేపీ నుంచి బహిష్కరించాలంటూ ధర్నాలు జరిగాయి. ఇప్పుడు మరోమారు జగిత్యాల వాసులు స్టేట్ ఆఫీస్‌కు వద్ద ఆందోళనలు చేస్తుండగా, ఒకరైతే శుక్రవారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అర్వింద్ హఠావో... బీజేపీకో బచావో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ జగిత్యాల వాసులు చేసిన ధర్నాకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను నిజామాబాద్‌లోనూ బీజేపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ నిరసనను వ్యక్తం చేస్తున్నారు.

**కరపత్రాల కలకలం..**

అర్వింద్‌పై ప్రజల్లోనే కాదు.. సొంత పార్టీలోనూ వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ కార్యకర్తలు ఇప్పటికే రాష్ట్ర కార్యాలయంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. పార్టీ ఆఫీసులోనే ఓ వ్యక్తి ఏకంగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. తాజాగా అర్వింద్‌కు వ్యతిరేకంగా కరపత్రాలు సోమవారం ప్రచారంలోకి వచ్చాయి. 'నియంత ధర్మపురి అర్వింద్ వద్దు' అని రాసి ఉన్న కరపత్రాలు జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాల్లో వెలుగు చూశాయి. 'కూలింగ్ గ్లాసులు తీయడు, కారు దిగడు, ప్రజలతో మాట్లాడడు.. ఇంతటి అహంకారి నియంత అర్వింద్ ఎంపీగా మాకొద్దని' ఆయా పత్రాల్లో ప్రచురించారు. దీంతో అర్వింద్ వైఖరిపై మరోమారు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు, ఈ కరపత్రాలపై ఎంపీ అర్వింద్ సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఆయన తమ్ముడు చేయించిన పని అని పేర్కొన్నారు.




అర్వింద్‌కు వ్యతిరేకంగా మెట్‌పల్లిలో సోమవారం పంపిణీ చేసిన కరపత్రాలు

### ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో అదే తీరు..

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, అన్నిచోట్లా అర్వింద్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఆర్మూర్‌లో వినయ్‌రెడ్డి, సీనియర్ నేత అల్జాపూర్ శ్రీనివాస్ వంటి వారు ఆయన వల్ల ఇబ్బంది పడిన వారే. ఈ జాబితాలో నిజామాబాద్ అర్బన్‌లో యెండల లక్ష్మీనారాయణ ఉండగా, తాజాగా బస్వా లక్ష్మీ నర్సయ్య కూడా చేరారు. బోధన్‌లో మోహన్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇప్పించుకోవడంపై పార్టీలోనే అసమ్మతి స్వరాలు చెలరేగాయి. అప్పటిదాకా పార్టీ కోసం తీవ్రంగా శ్రమించిన మేడపాటి ప్రకాశ్‌రెడ్డి తీవ్ర నిరాశకు గురయ్యారు. నిజామాబాద్ రూరల్‌లో దినేశ్‌రెడ్డికి పెత్తనం ఇచ్చి జిల్లా అధ్యక్షుడిని చేయడంతో మిగిలిన వారంతా మండిపడుతున్నారు. ఇదే పరిస్థితి బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లోనూ నెలకొంది. అసంతృప్త నేతలంతా ఏకమై ఇప్పటికే జాతీయ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు, అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. వచ్చే ఎన్నికల్లో అర్వింద్‌కు టికెట్ ఇస్తే తామంతా పని చేయమంటూ హెచ్చరించగా, కొందరైతే తమ పేర్లను పరిశీలించాలని దరఖాస్తులు కూడా చేస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో కాషాయ కండువా కప్పుకున్న అర్వింద్ అధిష్టానం పెద్దల ఆశీస్సులతో టికెట్ సంపాదించుకున్నాడు. అప్పటివరకు జెండాలు మోసిన వారంతా మిన్నకుండిపోగా, పార్టీలో ప్రాధాన్యం దక్కుతుందని ఆశించిన వారు భంగపడ్డారు. ఎంపీగా గెలిచిన తర్వాత అర్వింద్ పెత్తనమే పెరగడం, పాత తరం నాయకత్వం మూలకు పరిమితం కావడంతో కింది స్థాయి శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి. ప్రస్తుతం నిజామాబాద్ బీజేపీ కార్యాలయంలో తాళం చెవి కూడా పాత తరం నాయకత్వానికి అందుబాటులో లేకుండా పోయిందంటే అతిశయోక్తి కాదు.

# తీరు మారదా?

## ప్రజావాణి ప్రాంగణంలో ధర్నా

- భద్రతా వైఫల్యంతో పెద్ద సంఖ్యలో జనం
- స్తంభించిన దరఖాస్తుల స్వీకరణ



ప్రజావాణి ప్రాంగణంలో ధర్నా నిర్వహిస్తున్న జాన్కంపేట గ్రామస్తులు


కంఠేశ్వర్, ఫిబ్రవరి 19: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం అధికారుల తీరుతో అభాసుపాలవుతున్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి వినతులు అందించినా పరిష్కారానికి నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి భద్రతా వైఫ ల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. కలెక్టరేట్ ప్రాంగణంలోని దరఖాస్తులు స్వీకరించే హాలులోకి సోమవారం వేల్పూర్ మండలం జాన్కంపేట గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడమే ఇందుకు నిదర్శనం. గత ప్రజావాణిలో ధర్నా నిర్వహించిన గ్రామస్తులు మరోసారి నిరసన తెలపడం గమనార్హం. వీరి ధర్నాతో దాదాపు 20 నిమిషాల పాటు ప్రజావాణి స్తంభించింది. దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. అధికారులు స్పందించి ఇకనైనా ప్రజావాణి కార్యక్రమం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**'ప్రజావాణి'కి 88 ఫిర్యాదులు**

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 88 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీపీవో చక్రవర్తి తరుణ్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో తప్పిదాలు ఉండొద్దు

- పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జిల్లా అధికారులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 19 : ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లకు సూచించారు. జాబితాలో మార్పులు –చేర్పులు, పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా అందజేయాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కొత్తగా నమోదైన ఓటర్లకు నిర్దిష్ట గడువులోగా గుర్తింపు కార్డులు చేరేలా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఓటరు ఐడీని హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చనే విషయంపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జాగ్రత్తగా గుర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు చేపడుతున్న చర్యలకు సంబంధించి ఎప్పటికప్పుడు తమకు నివేదికలు పంపించాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్రమంతప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

**జాబితాను పక్కాగా పరిశీలించాలి: కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా అన్ని స్థాయిల్లో పకడ్బందీగా పరిశీలించాలని అధికారులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశించారు.వీసీ అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారి నుంచి సైతం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. మృతి చెందిన ఓటర్ల పేర్ల తొలగింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, కమిషనర్ ఎం.మకరంద్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి సురేశ్‌కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్‌కుమార్, భుజంగ్‌రావు, సహాయ ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంతోష్ పాల్గొన్నారు.

## బోధన్ నుంచి మహారాష్ట్రకు ఆర్టీసీ బస్సుల నిలిపివేత

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 19: బోధన్ ఆర్టీసీ డిపో నుంచి మహారాష్ట్రకు వెళ్లే సర్వీసులను నిలిపివేసినట్లు బోధన్ డీఎం శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మహారాష్ట్రలో బీసీ రిజర్వేషన్లపై కొనసాగుతున్న నిరసనలు ఉద్రిక్తంగా సాగుతున్న నేపథ్యంలో బస్సులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. బోధన్ నుంచి నాందేడ్‌కు వెళ్లే ఐదు బస్సులు, దెగ్లూర్‌కు రెండు, ఔరాద్‌కు రెండు, కందకుర్తి మీదుగా ధర్మాబాద్‌కు నడిపే రెండు బస్సులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. అక్కడి పరిస్థితులు సానుకూలంగా మారిన అనంతరం సర్వీసులను కొనసాగిస్తామని డీఎం పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. రెండు రోజులుగా ఈ బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

## జంటలకు ఆర్థిక ప్రోత్సాహం

పిట్లం, ఫిబ్రవరి 19: కులాంతర వివాహం చేసుకున్న మూడు జంటలకు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు రూ. 2.5 లక్షల బాండ్లను మండలకేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యశాఖ, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారిణి రజిత, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి లియో, మండల అధికారులు పాల్గొన్నారు.



కులాంతర వివాహాలు చేసుకున్న వారికి బాండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**కలెక్టర్‌కు బాధితుల వినతి..**

జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులు కలెక్టర్‌ను కలిశారు. తమకు త్వరగా డబ్బులు అందేలా చూడాలని కోరగా, కలెక్టర్ స్పందించి భరోసా కల్పించారు.

## నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ రాక వాయిదా

బోధన్, ఫిబ్రవరి 19: ఈనెల 20న బోధన్‌కు రావాల్సిన నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ రాక వాయిదా పడింది. నిజాంషుగర్స్ పునరుద్ధరణ సాధ్యాసాధ్యాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మంగళవారం శక్కర్‌నగర్‌లోని కర్మాగారాన్ని పర్యవేక్షించేందుకు వస్తుందని, చెరుకు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించేందుకు ఏర్పాట్లు చేశారు. కమిటీ రాక వాయిదా పడినట్లు సోమవారం సాయంత్రం అధికారులు తెలిపారు. కమిటీ తిరిగి ఎప్పుడు వస్తుందనేది త్వరలోనే ప్రకటిస్తారని వారు పేర్కొన్నారు.